దేశానికే.. తలమానికం

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): ఉద్యమ నేత కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలో ఎన్నో అద్భుత కట్టడాలు, చారిత్రక నిర్మాణాలు చేపట్టింది. రాష్ట్రానికే కాకుండా యావత్తు దేశానికే గర్వకారణంగా నిలిచిన ఆ నిర్మాణాల ఖ్యాతిని చాటుతూ, ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ టీవీ చానళ్లు ప్రత్యేక కథనాలను ప్రసారం చేసిన విషయం తెలిసిందే. అలాంటి విశిష్టమైన కట్టడాల్లో ఒక్కటైన సచివాలయం ప్రస్తుతం మరోసారి వార్తల్లోకెక్కింది. తెలంగాణ సచివాలయం.. ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ చానళ్లను మరోసారి ఆకర్షించింది. లోక్ సభ ఎన్నికల దృష్ట్యా ఇటీవల చానెళ్లు అన్నీ హైదరాబాద్‌కు క్యూ కట్టాయి. ఇంకనూ వస్తూనే ఉన్నాయి. తెలంగాణ ఇతివృత్తంగా చెబుకునే కట్టడాలను బ్యాక్‌గ్రౌండ్‌గా చేసుకొని ఆయా చానళ్లు ప్రత్యేక ఇంటర్వ్యూలు, రాజకీయ కథనాలు చేస్తున్నాయి. అయితే, వీటన్నింటికి ఓ వ్యూ పాయింట్‌గా తెలంగాణ సచివాలయాన్ని ఎంచుకోవడం విశేషం. బ్యాక్ గ్రౌండ్‌లో ఆ అద్భుత నిర్మాణం తమ టీవీ చానెళ్లలో కనిపించేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జాతీయ చానెళ్లు తెలంగాణ రాజకీయాలపై రూపొందిస్తున్న స్టోరీలు, ప్రోమోలలో కేసీఆర్ నిర్మించిన సచివాలయం.. హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా చూపిస్తున్నారు. 'ఇండియా టుడే, టైమ్స్ నౌ, హిస్టరీ 18' తదితర జాతీయ, అంతర్జాతీయ చానెళ్లు హైదరాబాద్‌లో ఎక్స్‌క్లూజివ్ స్టోరీలు చేశాయి. ఆ కథనాల్లో తెలంగాణ సచివాలయాన్నే ప్రధాన వేదికగా చేసుకుని తమ టీవీలో ప్రత్యేక ఆకర్షణగా ప్రసారం చేశారు. టైమ్స్ ఆఫ్ ఇండియా బుధవారం నిర్వహించిన తమిళనాడు చీఫ్ అన్నామలై ఇంటర్వ్యూను హుస్సేన్ సాగర్ లేక్ బోటులో ఏర్పాటు చేసింది. అయితే, ఈ ఇంటర్వ్యూలో వ్యూ పాయింట్‌గా తెలంగాణ సచివాలయాన్ని ప్రత్యేకంగా ఆ చానెళ్లు చూపించడం విశేషం. మరో చానెల్ 'టైమ్స్ నౌ' కూడా రాజకీయ కథనాలు చేస్తూ తెలంగాణ సచివాలయాన్నే ప్రధాన వేదికగా చూపించడం విశేషం. దీంతో పాటు 'హిస్టరీ టీవీ 18' జాతీయ చానెల్ అమరవీరుల స్మారక స్థూపం, కట్టడంపై ప్రత్యేక కథనం చేసి కేసీఆర్ పాలనకు కితాబునిచ్చింది.

కేసీఆర్ నిర్మించిన పలు నిర్మాణాలలో సచివాలయానికి జాతీయ చానెళ్లు ఫిదా..

లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా హైదరాబాద్‌కు క్యూ కట్టిన జాతీయ చానెళ్లు

ప్రత్యేక ఇంటర్వ్యూలన్నీ సచివాలయం కనిపించేలా ఏర్పాట్లు

'ఇండియా టుడే, టైమ్స్ నౌ' తదితర నేషనల్ చానెళ్లలో వ్యూ పాయింట్‌గా సచివాలయం

తమిళ నాడు చీఫ్ అన్నామలై ప్రత్యేక ఇంటర్వ్యూలోనూ మెరిసిన సచివాలయం

సచివాలయ నిర్మాణానికి దేశం ఫిదా..!

తెలంగాణ సచివాలయం. అది 28 ఎకరాలల్లో సువిశాల ప్రాంగణం. 10.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునికంగా రూపుదిద్దుకున్న భవనం. విభిన్న సంస్కృతులకు అద్దం పట్టే నిర్మాణ శైలుల్లో వెలిసిన కట్టడం. తెలంగాణ సచివాలయం ప్రాంగణంలో 875కి పైగా తలుపులున్నాయి. అన్నింటినీ టేకుతోనే తయారు చేశారు. ఇండో పర్షియన్ – అరేబియన్ నిర్మాణాల మిశ్రమ శైలి సచివాలంయలో కనిపిస్తుంది. సచివాలయం ప్రారంభం నుంచే 26 నెలల్లో పూర్తి చేసి రికార్డు సృష్టించారు. ఈ సచివాలయాన్ని చూసి ప్రతి ఒక్కరు మురిసిపోయేలా నిర్మించారు. హైదరాబాద్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఆ నిర్మాణం తల ఎత్తుకుని నిల్చొన్నట్టుగా ఉందంటూ నిపుణులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. హైదరాబాద్‌కు వచ్చే జాతీయ, అంతర్జాతీయ వ్యక్తులు ఎవ్వరైనా తమ డెస్టినేషన్ లిస్టులో కేసీఆర్ నిర్మించిన సచివాలయం, అమరవీరుల స్థూపం, అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం ప్రధానంగా ఉంటున్నాయని పర్యాటక శాఖ అధికారులు చెబుతున్నారు. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని.. అద్భుత నిర్మాణాన్ని సాధ్యం చేసిన కేసీఆర్‌కు ప్రతి ఒక్కరు హ్యాట్సాఫ్ చెబుతూ.. సోషల్ మీడియాలోనూ పోస్టులు పెడుతున్నారు. కేసీఆర్ నిర్మించిన ఈ అద్భుత కట్టడాలను వీక్షించేందుకు కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఇతర రాష్ట్రాల నాయకులు సైతం క్యూ కడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొని కాలక్షేపంగా ఆ నిర్మాణాలు వీక్షించి చర్చించుకుంటున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

'అమ్మ చెక్కిన శిల్పం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

అమ్మ చెక్కిన శిల్పం పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, మే 14: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జాలాది రత్న సుధీర్ రచించిన 'అమ్మ చెక్కిన శిల్పం' హిందీ అనువాద పుస్తకావిష్కరణ సభ మంగళవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. సభా అధ్యక్షుడిగా రాంబాబు, ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి విచ్చేసి 'అమ్మ చెక్కిన శిల్పం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ జాలాది రత్న సుధీర్ రచించిన అమ్మ చెక్కిన శిల్పం పుస్తకం చాలా అద్భుతంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని పుస్తకాలు రాయాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రూప్ కుమార్ డబ్బీకార్, డా.సురభి శారద, గోవింద్ అక్షయ్, దీపక్ చిండాలియా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ 10, 12 తరగతుల ఫలితాలలో నేషనల్ టాపర్‌గా

'నారాయణ' జైత్రయాత్ర

138 బ్రాంచ్‌లలో 100 శాతం ఉత్తీర్ణత

జూబ్లీహిల్స్, మే 14: సీబీఎస్ఈ 2024 ఫలితాలలో మరోమారు నారాయణ జైత్రయాత్ర కొనసాగింది. అత్యుత్తమ మార్కులతో అగ్రస్థానం కైవసం చేసుకుంది. పది ఫలితాలలో అగస్త్య రేమాని 500 మార్కులకు గాను 498 మార్కులతో సంచలనం సృష్టించాడు. 12లో ఖ్యాతి శర్మ 500 మార్కులకు గాను 493 మార్కులు సాధించగా, శ్యామ్ శ్రేయాస్ జోసఫ్, సానా తబుస్సుం 492 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. పదో తరగతిలో తొమ్మిది మంది విద్యార్థులు 495కు పైగా మార్కులు, 49 మంది 490కి పైగా, 156 మంది 485కు పైగా మార్కులు సాధించారు. 12లో మొత్తం 667 మంది 90 శాతం పైగా మార్కులను, 1909 మంది 80 శాతం పైన మార్కులు సాధించారు. పదో తరగతిలో 2012 మంది విద్యార్థులు 90 శాతం పైగా, 4,219 మంది విద్యార్థులు 80 శాతానికి పైగా సాధించారని నారాయణ విద్యా సంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పి.సింధూర, పి.శరణి తెలిపారు. ఈ ఫలితాలన్నీ నారాయణ ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్స్ ద్వారా సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.., ఈ స్థాయి ఫలితాలు మరే విద్యా సంస్థ సాధించలేదని.., టాప్ మార్కులలో గాని, సబ్జెక్టుల వారీగా గాని, నూటికి నూరు శాతం మార్కులలో గాని అత్యధిక సంఖ్యలో ఫలితాలు సాధించడం నారాయణకు ఆనవాయితీగా వస్తుందన్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిస్సా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలోని 138కి పైగా బ్రాంచ్‌లలో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఈ ఫలితాలు నారాయణ పటిష్ట ప్రణాళికకు, ఉపాధ్యాయుల అకుంఠిత దీక్షకు నిదర్శనంగా నిలుస్తాయన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ, రీసెర్చ్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌లో సీఓ స్పార్క్, ఒలంపియాడ్, ఈ-టెక్నో, మెడిస్పార్క్ ప్రోగ్రామ్స్‌తో బోధన చేయడం కారణంగానే ఘన విజయాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయుల వలననే అద్భుత విజయాలు సాధించినట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకేతర సిబ్బందికి నారాయణ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

'మార్మిక నది' ప్రజా చైతన్య కవితా ప్రవాహం

పద్మశ్రీ కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మే14: కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ రాసిన 'మార్మికనది' కావ్యం ఒక ప్రజా చైతన్య ప్రవాహమని, దానికి కేంద్ర సాహిత్య అకాడమీ వచ్చి తీరాలని పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. విశాల సాహితీ, భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చిక్కడపల్లి కళాభారతిలో ప్రముఖ కవి బిక్కి కృష్ణ రచించిన 'మార్మిక నది' కావ్యం పై మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ బిక్కి కృష్ణ కవిత్వం, పరిశోధనలు, సాహిత్య సేవలు అనితరసాధ్యమని కొనియాడారు. ఎమ్మెల్సీ, ప్రసిద్ధ కవి గోరటి వెంకన్న మాట్లడుతూ, బిక్కి కృష్ణ గొప్ప కవిత్వం, విమర్శలు రాశారన్నారు. సమావేశంలో ప్రసిద్ధ కవి డాక్టార్ నాశేశ్వరం శంకరం, ప్రముఖ కవి విద్యాధర్, రోహిణీ వంజారి తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ పది ఫలితాల్లో డా.కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థుల హవా

జూబ్లీహిల్స్, మే 14: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ సోమవారం విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. జయంత్ నాగ్ గట్టు 500 మార్కులకు గాను 489, అర్జున్ జాగర్లమూడి, వై.చరిష్మాలు 487 మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. 480 మార్కుల పైబడి 16 మంది విద్యార్థులు, 475 మార్కులు పైబడి 33 మంది, 470 మార్కులు పైబడి 61 మంది, 460 మార్కులు పైబడి 113 మంది, 450 మార్కులు పైబడి 205 మంది విద్యార్థులు గౌరవప్రదమైన మార్కులు సాధించగా, స్కూల్ సగటు యావరేజ్ 76.7 శాతంగా నమోదయ్యిందని వెల్లడించారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, సిబ్బందికి స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలిపింది.

ఎప్పటికి పూర్తయ్యేనో..

గచ్చిబౌలి చౌరస్తాలో నిర్మిస్తున్న స్టీల్ ఫ్లై ఓవర్ ఇది. ఓఆర్ఆర్ ఎగ్జిట్-19 నుంచి గచ్చిబౌలి చౌరస్తా మీదుగా కొండాపూర్, మాదాపూర్‌లకు నేరుగా, ట్రాఫిక్ తీవ్రతను అధిగమిస్తూ వెళ్లేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టు ఇది. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు దాటింది. నిర్మాణ పని మాత్రం 'ఎక్కడ వేసిన గొంగడి.. అక్కడే' అన్న చందంగా మారింది.

సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

భగీరథుని ప్రయత్నం.. అందరికీ ఆదర్శం

డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు

చిక్కడపల్లి, మే 14: పేదరికాన్ని చదువు ద్వారానే జయించడం సాధ్యమవుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు అన్నారు. ఆకాశం నుంచి గంగను భూమి మీదికి తీసుకుచ్చిన మహర్షి అందిరికీ ఆదర్శమని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ సగర సంఘం ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భగీరథ మహర్షి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, బీసీ సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్, హరి కిషన్, మారుతి సాగర్, ఆంజనేయ హాజరయ్యారు. వకుళాభరణం మాట్లాడుతూ, కఠినమైన తపస్సుతో గొప్ప కార్యాన్ని సాధించిన భగిరథుని వారసులుగా సగరులు ఏదైనా సాధించవచ్చునని ఆయన పేర్కొన్నారు. గ్రేటర్ అధ్యక్షుడు ఎం.రవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గౌ.అధ్యక్షుడు వెంకటస్వామి, ప్ర.కార్యదర్శి వెంకటరాములు స్వామి, కోశాధికారి రామస్వామి పాల్గొన్నారు.

'హరే కృష్ణ'కు ఎలక్ట్రిక్ వాహనం వితరణ

మణికొండ, మే 14: నిరుపేదలకు అండగా నిలిచేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ ఎల్లప్పుడు నిరంతరాయంగా పని చేస్తున్నదని హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ అన్నారు. పేదలకు ఆహారం పంపిణీ కోసం హరే కృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు రూ.16.5 లక్షల విలువైన ఎలక్ట్రికల్ వాహనాన్ని ప్లంబింగ్, ఎలక్ట్రికల్ సొల్యూషన్స్ రంగంలో అగ్రగామిగా ఉన్న సావరియా పైప్స్ సంస్థ విరాళంగా అందజేసింది. అయితే, ఈ వాహనాలను మంగళవారం ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సావరియా పైప్స్ మేనేజింగ్ డైరెక్టర్ సుజిత్ అగర్వాల్ మాట్లాడుతూ, సమాజానికి తిరిగి ఇవ్వడం అనే ఒరవడిని సావరియా పైప్స్ యాజమాన్యం అవలంభిస్తుందన్నారు.

హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు విరాళంగా అందజేసిన ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య గౌర చంద్ర దాస ప్రభూజీ తదితరులు

భగీరథ చిత్రపటానికి నివాళులర్పించిన ఎంపీ ఆర్.కృష్ణయ్య

సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, మే 14: సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో సగర ఉప్పర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన భగీరథ జయంత్యుత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. సగరులను బీసీడీ నుంచి గ్రూప్-ఏలోకి మార్చాలని, ప్రతి సగర కుటుంబానికి 20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగర కార్పొరేషన్‌కు 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, చట్ట సభల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో దాదాపు ఎనిమిది లక్షలకు పైగా ఉన్న సగరులకు విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, విజయేంద్ర సాగర్, హనుమంతు సాగర్, పార్థసారథి, జనార్దన్, నందగోపాల్, అనంతయ్య, జయంతి, ఉదయ్, నిఖిల్, హేమంత్ పాల్గొన్నారు.

తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ సభ్యులుగా ఐఐసీటీ సైంటిస్టులు

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి చెందిన పలువురు పరిశోధకులు సభ్యులుగా ఎన్నికయ్యారు. చీఫ్ సైంటిస్ట్‌గా వ్యవహరిస్తున్న. డా.టి.వెంకటేశ్వర్ రావు, డా.సూర్య ప్రకాష్ సింగ్, డా.ఎస్.రామ్మోహన్, డా.ప్రత్యాయ్ బాసక్, డా.నివేదిత సాహూ, డా.ఎం.మధుమాల, డా.జి.జితేందర్ రెడ్డి, డా.అందుగులపాటి సాయి ఎఫ్‌టీఏఎస్‌కు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మే 14: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఈ (సీబీసీఎస్) (ఏఐసీటీఈ) అన్ని బ్రాంచిల మొదటి, ఏడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలతో పాటు బీఏ లాంగ్వేజెస్ పరీక్షా ఫలితాలను విడుదల చేశామని చెప్పారు. ఈ ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా ఐఐసీటీ సైంటిస్ట్ అభిజిత్

సిటీబ్యూరో, మే 14(నమస్తే తెలంగాణ): రసాయనిక, సాంకేతిక రంగాల్లో ఉన్నత విద్యా, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించే కెమ్‌నానోమ్యాథ్ జర్నల్‌కు ఐఐసీటీ సైంటిస్ట్ అభిజిత్ హజారిక అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం ఐఐసీటీలో పాలిమర్స్ అండ్ ఫంక్షనల్ మెటీరియల్స్‌లో సైంటిస్ట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏషియన్ కెమికల్ ఎడిటోరియల్ సొసైటీ ఆయన ఎంపికను ఖరారు చేసింది. కాగా, ఆయన ఎంపికపై ఐఐసీటీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

ఎన్‌హెచ్ఎంలో సుదీర్ఘ కాల ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రామ రాజేష్ ఖన్నా, ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

రామ రాజేష్ ఖన్నా

సుల్తాన్‌బజార్, మే 14: జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో గత 24 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 17 వేల 541 మంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులని క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ ట్రేడ్ యూనియన్, ఎన్‌హెచ్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మంగళవారం ప్రభుత్వాన్ని కోరారు. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎన్‌హెచ్ఎం పథకం కింద సేవలు వినియోగించుకుంటున్న ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు మాత్రం ముందుకు రావకపోవడం దారుణమన్నారు. దీంతో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇదిలా ఉండగా, కోఠి కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మార్చి, ఏప్రిల్ నెలల వేతనాలు ఇంకా రాలేదని తక్షణమే విడుదల చేయాలని అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారి సర్వీసును వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసి అన్ని క్యాడర్‌లకు 510 జీవో వర్తింపజేసి న్యాయం చేయాలన్నారు. ప్రతి నెల 5వ తేదీ లోపలే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు నాలుగు వేల మందికి 510 జీవో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో వేతనాలు చెల్లించాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజులతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని అన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో మెరిసిన ఏఎంఎస్ విద్యార్థిని

ముగిసిన ఆసియా స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్

ఇ.శృతి

ఉస్మానియా యూనివర్సిటీ, మే 14: ఇటీవల ముగిసిన ఆసియా స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థిని సత్తా చాటింది. బీ కామ్ రెండో సంవత్సరం చదువుతున్న ఇ.శృతి ఆ పోటీల్లో మన దేశానికి ప్రాతినిధ్యం వహించి, మొత్తం ఎనిమిది పతకాలు కొల్లగొట్టింది. వాటిలో ఏషియన్ యూనివర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో నాలుగు బంగారు పతకాలు, ఏషియన్ పవర్ లిఫ్టింగ్ ఓపెన్ చాంపియన్‌షిప్‌లో నాలుగు కాంస్య పతకాలు ఉండటం విశేషం. ఈ పోటీలు ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హాంగ్‌కాంగ్‌లో జరిగాయి. ఈ సందర్భంగా ఆమెను కళాశాల చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, సెక్రెటరీ డాక్టర్ ఎన్.రజని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఝాన్సీరాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.కరుణాదేవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఏ.ప్రమీల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో కళాశాల కీర్తి ప్రతిష్టలు చాటిడం తామందరికీ గర్వకారణంగా ఉందని ప్రశంసించారు.